# నామినేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు చేయాలి


కరీంనగర్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయ ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో డాక్టర్ బీ గోపి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డాక్టర్ బీ గోపి
- రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాట్లు పరిశీలన

కలెక్టరేట్, అక్టోబర్ 25: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టి, సత్వరమే పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బీ గోపి ఆదేశించారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో చేపట్టిన ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ బీ గోపి మాట్లాడుతూ, నామినేషన్ స్వీకరించే రోజు నుంచి ప్రక్రియ ముగిసే వరకు ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యాలయానికి వంద మీటర్ల వరకు దారి, దుకాణాలు మూసివేయాలని, ఎన్నికల నిబంధనల మేరకు మాత్రమే నామినేషన్ వేసే వారితో పాటు మరో నలుగురిని అనుమతించాలని సూచించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీయించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో ఎన్నికల నిబంధనల మేరకు ఉదయం 11 గంటల కంటే ముందు మధ్యాహ్నం 3 గంటల అనంతరం నామినేషన్లు స్వీకరించరాదని స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియను ఎక్కడ, ఎప్పుడు నిర్వహిస్తారనే సమాచారాన్ని అభ్యర్థులకు తెలియజేయాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యాలయాల్లో వెంటనే వ్యయ పరిశీలన, సి-విజిల్, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, బ్యానర్లు ప్రదర్శించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మహేశ్వర్, ఏసీపీ నరేందర్, కరీంనగర్ రూరల్, అర్బన్ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

**చొప్పదండిలో నామినేషన్ కేంద్రం పరిశీలన**

చొప్పదండి, అక్టోబర్ 25: నామినేషన్ కేంద్రంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బీ గోపి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ ప్రక్రియకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట చొప్పదండి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఏసీఎల్పీ) ప్రఫుల్ దేశాయ్, తహసీల్దార్ నరేందర్, సీఐ రవీందర్, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ తదితరులున్నారు.


లబ్ధిదారులకు లక్ష సాయం చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్(ఫైల్)

# పేదలకు ఆర్థిక భరోసా

- నియోజకవర్గంలో 300 మందికి లక్ష చొప్పున సాయం పంపిణీ
- ఆనందంలో లబ్ధిదారులు

చొప్పదండి, అక్టోబర్ 25: కులవృత్తి చేసుకునే బీసీ కుటుంబాలకు చేయూతనందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష చొప్పున సాయం అందజేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి మొదటి విడుతలో ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.400 కోట్లు విడుదల చేశారు. విశ్వబ్రాహ్మణులు, నాయీబ్రాహ్మణులు, రజకులు, కుమ్మరి, మేదరి తదితర కుల వృత్తులు చేసే వారు పనిముట్లు, ముడి సరుకు కొనుగోలు చేసేందుకు పూర్తి సబ్సిడీతో ఈ సాయం అందిస్తున్నది. చొప్పదండి నియోజకవర్గంలో 300 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇప్పటికే ఆర్థిక సాయం అందించగా సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందుతున్నారు. ఆర్థిక సాయం అందజేసిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**ఇస్త్రీ చేస్తూ ఉపాధి పొందుతున్న**



తెలంగాణ ప్రభుత్వం బీసీ కులవృత్తుల వారిని ఆదుకునేందుకు రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తుండడం గొప్ప విషయం. ప్రభుత్వం ఇచ్చిన రూ.లక్షతో లాండ్రీ షాపు పెట్టుకొని, ఇస్త్రీ చేస్తూ ఉపాధి పొందుతున్నా. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు కులవృత్తుల వారిని పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం కులవృత్తిదారులను గుర్తించి రూ.లక్ష ఆర్థిక సాయం చేయడంతో మాలాంటి కుటుంబాలకు ఆర్థికంగా భరోసా కలుగుతున్నది.

-ఒడ్నాల సాయికుమార్, చిట్యాలపల్లి (చొప్పదండి మండలం)



**సెలూన్ షాపు పెట్టుకున్న**

సీఎం కేసీఆర్ కులవృత్తుల వారికి రూ. లక్ష సాయం అందించి మాలాంటి నిరుపేదలకు ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన రూ. లక్షతో గ్రామంలో సెలూన్ షాపు పెట్టుకొని ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. కులవృత్తుల వారికి సీఎం కేసీఆర్ ఆర్థిక సాయం చేయడంతో నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయి. ఆర్థిక సాయం అందజేసిన సీఎం కేసీఆర్ సార్‌కు, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు మా కుటుంబమంతా రుణపడి ఉంటాం.

-గడ్డం హరికృష్ణ, మంగళపల్లి (చొప్పదండి మండలం)


నాగులమల్యాలలో ప్రచారం చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు


ఖాజీపూర్‌లో..

# నాగులమల్యాల, ఖాజీపూర్‌లో మంత్రి కుటుంబ సభ్యుల ప్రచారం

కొత్తపల్లి, అక్టోబర్ 25 : కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కొత్తపల్లి మండలం నాగులమల్యాల, ఖాజీపూర్ గ్రామాల్లో మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు మంత్రి కుటుంబ సభ్యులకు ఘన స్వాగతం పలికారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యలను పరిష్కరించే మా నాయకుడైన గంగులకే మా ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. మంత్రి గంగుల కమలాకర్ కుటుంబసభ్యులు గంగుల సుధాకర్, శారద, గీత గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థించారు.


బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న తెలంగాణ వాసులు

## ఆస్ట్రేలియాలో బతుకమ్మ సంబురాలు

గంగాధర, అక్టోబర్ 25: ఆస్ట్రేలియాలోని టౌన్‌విల్ నగరంలోని ఊల్గురు కమ్యూనిటీ సెంటర్‌లో ప్రవాస భారతీయులు మంగళవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. ముఖ్య అతిథిగా మేయర్ జెన్నీహిల్ హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. నిర్వాహకులు నారాయణ, రాఘవ, సౌమ్య, రూప, తదితరులు పాల్గొన్నారు.


వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

## అ'పూర్వ' సమ్మేళనం

గంగాధర, అక్టోబర్ 25: మండలంలోని మధురానగర్‌లో గల సురభి కాన్వెంట్ హైస్కూల్‌లో 2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరికొకరు నెమరువేసుకున్నారు. కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిప్ప వీరేశం, డైరెక్టర్ చిప్ప వీరనర్సయ్య, పూర్వ ఉపాధ్యాయులు దామోదర్, నాగరాజు, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, మల్లేశం, రాజేశం, రమేశ్, గోపాల్‌రెడ్డి, ఆనందం, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం, పండ్ల పంపిణీ

హౌసింగ్‌బోర్డు కాలనీ, అక్టోబర్ 25: హమ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త కార్యదర్శి గోగూరి శ్రీధర్ రెడ్డి కూతురు హిమాన్వి పుట్టిన రోజును పురస్కరించుకొని బుధవారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. హమ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సాగర్, శేఖర్, శ్రీధర్ రెడ్డి ఉన్నారు.

వృద్ధులకు వడ్డన చేస్తున్న హమ్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు →



## ఆర్టీఐ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడిగా శ్రీధర్

తెలంగాణచౌక్, అక్టోబర్ 25: సమాచార హక్కు విజ్ఞాన సమితి (ఆర్టీఐ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన దొగ్గలి శ్రీధర్‌ను నియమిస్తూ సమాచార హక్కు విజ్ఞాన సమితి జాతీయ అధ్యక్షుడు పిల్లి నరేశ్‌మహేంద్ర బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన ఆర్టీఐ జాతీయ అధ్యక్షుడు పిల్లి నరేశ్‌మహేంద్ర, ప్రధాన కార్యదర్శి పటియాల యాదవ్, రాష్ట్ర నాయకురాలు ఉమామహేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు.